# పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం



డీఎంసీ మారుతీదివాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

**కాచిగూడ:** నూతన సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా అభివృద్ధి పనులను ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. కాచిగూడ డివిజన్‌లో ప్రారంభించాల్సిన పలు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని శుక్రవారం డీఎంసీ మారుతీదివాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్లు పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో ప్రజలు బోనాల పండుగ వేడుకలను సంతోషంగా ఎలా జరుపుకుంటారని ఆమె ప్రశ్నించారు. గుంతలు పడ్డ రోడ్లపై వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులను డిమాండ్ చేశారు.

◆ ముఖ్యంగా లింగంపల్లి, బాలప్పబాడలో నూతన రోడ్డు నిర్మాణపు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. జమాల్ బస్తీ, ఏకే భవన్ లేన్, ధరంపాల్ లైన్, పెట్రోల్ బంక్ లైన్, శాంతి నికేతన్ స్కూల్ లేన్ తదితర ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్డు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. నారాయణగూడ మోడల్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు.

◆ ఫీవర్ ఆసుపత్రి నాలా బ్రిడ్జి నుంచి నారాయణగూడ నాలా బ్రిడ్జి వరకు హుస్సేన్ సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణపు పనులను ప్రారంభించాలని కోరారు. కాచిగూడ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రమంత్రి, ఎంపీ జి.కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా డీఎంసీ మారుతీ దివాకర్‌కు ఫోన్‌లో వివరించి పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, భీమ్‌యాదవ్,రాహుల్‌యాదవ్, అరవింద్, శీర్‌సాగర్, సాగర్, వాసు, బల్వీర్, సంతోష్, సుభాష్ పటేల్, రాము, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్‌కు అనుగుణంగా పంటలను పండించాలి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు రామకృష్ణారావు, సుశీల, రవీందర్‌రావు

**చిక్కడపల్లి:** రైతులు మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటలను పండిస్తూ ఆదాయాన్ని మరింత పెంపొందించుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని నాబార్డు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన 43వ వ్యవస్థాపక వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో నాబార్డు కీలకభూమికను పోషిస్తుందన్నారు. పంటలపైనే కాకుండా అనుబంధ రంగాలైన డెయిరీ, ఫౌల్ట్రీ, ఫిషరీష్ నుంచి రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఆదాయంపై ప్రభావం చూపుతున్న వాటిపై నిరంతరం వినూత్న ఆలోచనలు చేయాలన్నారు.

◆ నాబార్డు సీజీఎం చింతల సుశీల మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో నాబార్డు భాగం కావడం సంతోషదాయకమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు సహకార సంస్థలను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రజలకు నాబార్డు ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. టీఎస్‌సీఏబీ అధ్యక్షుడు ఎం.రవీందర్‌రావు మాట్లాడుతూ.. నాబార్డు రైతులు గ్రామీణ ప్రజలకు మరింత సహకారం ఇందించాలన్నారు. అనంతరం 'ఏ డికేడ్ ఇన్ తెలంగాణ ఇంపాక్టింగ్ లివ్స్'పుస్తకాన్ని, ది యూనిట్ కాస్ట్ ఫర్ తెలంగాణ 2024–25 బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఉన్నతాధికారి అంజనీమిశ్రా, ఐసీఏఆర్–ఐఐఎంఆర్ డైరెక్టర్ సి.తారా సత్యవతి, నాబార్డు జీఎం ఉష, ఏజీఎం రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తికి చెక్




నర్సింహబస్తీలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ అమృత

**చిక్కడపల్లి:** పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు విధి నిర్వహణలో అసౌకర్యాలు కలిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ

**దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి**

**నల్లకుంట:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత సూచించారు. నర్సింహబస్తీలో దోమల నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇళ్లలో వాడే కుండీలలో రెండ్రోజులకోసారి మార్చాలని సూచించారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచొద్దని కోరారు. కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




సత్యానగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ అమృత, అంగన్‌వాడీ టీచర్లు

## సత్యానగర్‌లో అంగన్‌వాడీ బడిబాట

**నల్లకుంట:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల పునర్ వైభవానికి కృషి చేసేలా బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. ఐసీడీసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్యానగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి అమ్మమాట అంగన్‌వాడీ బాట, అంగన్‌వాడీ బడి ముద్దు.. ప్రైవేటు బడి అసలే వద్దు.., బిడ్డ సంక్షేమం.. అంగన్‌వాడీ ఆశయం అనే నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారని చెప్పారు.

# జిల్లా కార్యవర్గ సమావేశానికి అందరూ హాజరు కావాలి

**కాచిగూడ:** బీజేపీని నగరంలో మరింత బలోపేతం చేయడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణలోని సైనికుల్లా కష్టపడి పనిచేయాలని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ తేదీన సోమాజిగూడ లోని జయా గార్డెన్స్‌లో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యవర్గ సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.నందకిషోర్ యాదవ్, వై.అమృత, ఎ.సూర్యప్రకాష్ సింగ్, జి. ఆనంద్‌గౌడ్, సందీప్ సాయి, వనం రమేష్, అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

# ప్రైవేట్ హాస్టళ్లు.. రూల్స్ పట్టించుకోరు.!

## కనీస నిబంధనలు పాటించని హాస్టళ్ల యజమానులు

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, సివిల్ సప్లై అధికారులు
- రోజురోజుకి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు హాస్టళ్లు



ఇటీవల ఓ ప్రైవేటు హాస్టల్‌లో లీకైన గ్యాస్ సిలిండర్ (ఫైల్)

**కవాడిగూడ:** ఇటీవల ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకోసం నోటిఫికేషన్లు విడుదల చేయడంతో నిరుద్యోగులు గ్రామీణ పట్టణ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా హైదరాబాద్‌కు ప్రతిరోజు వలస వస్తున్నారు. ఈ అంశం హాస్టల్ నిర్వాహకులకు కల్పతరువుగా మారింది. చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, గగన్ మహల్, దోమలగూడ తదితర ప్రాంతాలలో ఇబ్బడి, ముబ్బడిగా హాస్టళ్లు వెలుస్తున్నాయి. నగరంలోని ప్రైవేటు హాస్టళ్లలో ఇరుకైన గదులు, సరైన వెంటిలేషన్ లేకపోవడం, అరకొర వసతులతోపాటు అపరిశుభ్రత వాతావరణంతో విద్యార్థులు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు, సివిల్ సప్లై అధికారులు ప్రైవేటు హాస్టళ్లపై చూసిచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**హాస్టల్ పటిష్ట భద్రతకు అధికారుల సూచనలు**

- ప్రజా భద్రత చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు హాస్టళ్లులో ప్రధాన ద్వారం, కారిడార్‌లు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి.
- మహిళ వసతి గృహం అయితే 24గంటలు వాచ్‌మెన్ కాపలా ఉండాలి.
- హాస్టల్లో పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై సరియైన అవగాహన ఉండాలి.
- ఫిర్యాదులు, సూచనలకోసం హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక బాక్స్ ఏర్పాట చేయాలి.
- హాస్టల్‌ల్లో చేరేవారి వివరాలతోపాటు కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి.
- హాస్టల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో ఉండేలా చూడాలి.
- ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్సకోంస సరైన సామగ్రిని హాస్టళ్లలో అందుబాటులో ఉంచాలి.
- అత్యవసర సమయాల్లో పోలీసులకు సమాచారం ఇచ్చేలా నోటీసు బోర్డును ఏర్పాటు చేయాలి.
- హాస్టల్‌కు వచ్చే సందర్శకుల వివరాలను నమోదు చేసేలా పట్టికను ఏర్పాటు చేసుకోవాలి.
- సంబంధిత అధికారుల నుండి హాస్టల్ ఏర్పాటు కోసం అనుమతులు తప్పనిసరి.

**డొమెస్టిక్ సిలిండర్లు వాడొద్దు..**

ప్రైవేటు హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కమర్షియల్ గ్యాస్ లిండర్లు వాడాలి. నిబంధనలు అతిక్రమించి డొమెస్టిక్ సిలిండర్లు వాడొద్దు. వాడితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. త్వరలో హాస్టళ్లలో తనిఖీలు చేపడతాం.

– దీప్తి, సర్కిల్–6 ఏఎస్‌వో

**నిబంధనలు పాటించాలి..**



ప్రతి ప్రైవేటు హాస్టల్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, హాస్టల్స్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దు, నిబంధనలు పాటించని హాస్టల్ యజమానులపై, హాస్టల్‌లో ఉండేవారు, చుట్టుపక్కల ప్రాంతాల వారు, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తాం.

– డి.శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ ఇన్‌స్పెక్టర్

## అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట



లంబాడి తండాలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాంనగర్ డివిజన్‌లోని లంబాడి తండాలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'కార్యక్రమాన్ని నిర్వహించారు. హిమాయత్‌నగర్ సెక్టార్ నాంపల్లి ప్రాజెక్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్ శైలజ ఆధ్వర్యంలో బస్తీలో అవగాహన కల్పించారు. విద్యతోనే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమా మహేశ్వరి, శశికళ, ప్రేమలత, ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన

**కాచిగూడ:** నారాయణగూడ వైఎంసీఏలో నిర్వహిస్తున్న వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ వస్త్ర ప్రదర్శనలో పురుషులు, మహిళలు, పిల్లలకు అన్ని రకాల బ్రాండెడ్ దుస్తులను అందుబాటులో ఉంచారు. అథెంటిక్ ఫార్మల్, క్యాజువల్ దుస్తులు వివిధ రకాల డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 24వ తేదీ వరకు వస్త్ర ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వస్త్ర ప్రదర్శన ఉంటుందన్నారు.

## పాలాభిషేకం

**చిక్కడపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం హర్షణీయమని చిక్కడపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ చిత్రపటానికి శుక్రవారం జవహర్‌నగర్‌లో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు గుర్రం చంద్రకళ, శంకర్, కెనడీరాజు, మారిశెట్టి నర్సింగ్‌రావు, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్‌బాబు, బి.యాదగిరిగౌడ్, ముక్కెర నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గల్లీలో వీధి దీపాలు వెలగాలి



వీధిదీపాల అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో వీధి దీపాల నిర్వహణ మెరుగ్గా నిర్వహించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు ఆదేశించారు. రాబోయే బోనాల వేడుకల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ప్రాంతంలో వీధిలైట్లు వెలిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం ఆయన నివాసంలో కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు అధికారులతో వీధి దీపాల సమస్యపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీధి దీపాలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ప్రతి గల్లీల్లో బోనాల ఊరేగింపులను దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శ్రీకాంత్, సౌమ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మౌనం వీడాలి

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ



ఎల్‌కే అద్వానీ వర్గీకరణకు మద్దతుగా రాసిన లేఖను చూపిస్తున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

**ముషీరాబాద్:** వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి పాస్ చేయించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి బీజేపీ ముఖ్య నేత ఎల్‌కే అద్వానీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని.. అందు కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖ రాశారని గుర్తు చేశారు. అప్పుడు అంత గట్టిగా మద్దతు ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన పదేళ్లు మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తుందని విమర్శించారు.

**ఆగస్టు 6 నుంచి ఢిల్లీలో దీక్ష..**

బీజేపీకి దళితులంటే ఇష్టం లేదని వారిని ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కేంద్రం జాప్యాన్ని, మోసాన్ని ఎండగట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7, 8వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పార్లమెంటులో బిల్లును పెట్టాలని దీక్ష చేపడుతున్నట్లు వంగపల్లి తెలిపారు. ఈ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు పి.రమేష్‌మాది, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకట్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్‌రావు, లక్ష్మణ్, ప్రేమ్‌దాస్, రాజు, నరేష్, తిరుమల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# భారత సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన



విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్, పండ్లు పంపిణీ చేస్తున్న ప్రవీణ్, తదితరులు

**నల్లకుంట:** ప్రముఖ సంఘ సేవకుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాగిఫణి ప్రవీణ్ బిల్డర్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలోని స్ఫూర్తి బాయ్స్ హోమ్ (అనాథ ఆశ్రమం)లో చిన్నారులకు 'సంస్కృతి, దాతృత్వం, మతం'పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు, పండ్లు, అందజేసిన ప్రవీణ్ అన్నదానం చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను వివరించారు. అలాగే విద్యార్థులను గోశాలకు తీసుకువెళ్లి గోవులకు దాన అందివ్వడం ద్వారా ఏర్పడే దాతృత్వాన్ని వివరించారు. అనంతరం బ్రహ్మ కుమారీస్ కేంద్రాన్ని సందర్శించారు.

# వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ షురూ



ముఖ్య అతిథి పి.జొనథాన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**కాచిగూడ:** వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో శుక్రవారం 24వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్–2024 క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీలను వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జొనథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎన్ని జాతులు, మతాలు, భాషలు, ప్రాంతాలు ఉన్నా అందరినీ ఏకం చేసే శక్తి క్రీడలకు మాత్రమే ఉంటుందన్నారు. లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో ఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, బాక్స్ క్రికెట్, త్రోబాల్, మార్చ్‌ఫాస్ట్ తదితర పోటీలు జరిగాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 30కి పైగా పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా క్రీడల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.

**మార్చ్‌ఫాస్ట్ విజేత హోలీమేరీ..**

మార్చ్‌ఫాస్ట్‌లో విజేతలుగా హోలీమేరీ హైస్కూల్ (ప్రథమ), సంఘమిత్ర హైస్కూల్ (ద్వితీయ), భాష్యం బ్లూమ్స్ హైస్కూల్ (తృతీయ) స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి ప్రిస్టిలీ గ్రేస్, బీజే.వినయ్ స్వరూప్, కార్గిల్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్స్ బి.ఇమాన్యుయేల్, జక్కయ్య పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆజామ్‌బాద్ ఫీడర్ పరిధిలో అచ్యుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గుండూ, విద్యానగర్ పోస్ట్ ఆఫీస్, జామాయి ఉస్మానియా ఫీడర్ పరిధిలో జామాయి ఉస్మానియా, ఎస్‌బీహెచ్ కాలనీ, అంబర్‌నగర్, లలితానగర్, ప్లేగ్రౌండ్‌ఫీడర్ పరిధిలో కుమార్ వాడీ, బుర్జుగల్లి, ఎరకుల బస్తీ, గాంధీ బొమ్మ, రహత్‌నగర్ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి 11.30 వరకు..

◆ మూన్ కేఫ్ ఫీడర్ పరిధిలోని ఫీవర్ ఆసుపత్రి, శ్రీరామ్‌నగర్, మూన్‌కేఫ్, హెరిటేజ్ ఫ్రెష్, అచ్చయ్యనగర్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 12 గంటల వరకు,

◆ సీసీ షరఫ్ ఫీడర్ పరిధిలోని సీసీషరఫ్ ఆసుపత్రి, భూమన్న గల్లీ, లింగంపల్లి, రాజేంద్రనగర్‌కాలనీ, బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో బాలాజీనగర్, అంబర్‌నగర్, లలితానగర్ తదితర ప్రాంతాల్లో 12గంటల నుంచి 12.30 వరకు..

◆ కృష్ణానగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్, తులసీనగర్, గంగానగర్, వెంకటేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో 12 గంటల నుంచి ఒంటి గంట వరకు

◆ ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని ఫీవర్ ఆసుపత్రి, అంజయ్య క్వాటర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పురా పెంట్రోల్ బంక్ ప్రాంతాల్లో ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

## నేడు 'చలో పార్లమెంట్' సన్నాహక సమావేశం

**కాచిగూడ:** ఆగస్టు 6న చేపట్టనున్న 'చలో పార్లమెంట్'కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో సన్నాహక సమావేశం ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. బీసీ సంఘాల ప్రతినిధులు, నేతలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## రేపటి నుంచి వరాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

**చిక్కడపల్లి:** జవహర్‌నగర్‌లోని శ్రీవరాల పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం ఈనెల 22 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎ.కనకరాజు యాదవ్ తెలిపారు. శుక్రవారం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల కనకరాజు, చైర్మన్ సీహెచ్.నిరంజన్, కోశాధికారి బండారు శ్రీరాములుతో కలసి మాట్లాడారు. 22వ తేదీన ఉదయం గణపతి హోమం, నవగ్రహపూజ, కలశపూజ, చండీహోమం, 12.30గంటలకు కుంకుమార్చన, 23న సాయంత్రం గంగతెప్ప, పుట్టబంగారం, 24వ తేదీన వరాల పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.యేసురత్నం, ఉపాధ్యక్షుడు సీహెచ్ సాయిలు, పంతులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సర్వసభ్య సమావేశం

**అంబర్‌పేట:** అంబర్‌పేటలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల వేడుకల కోసం ఈనెల 21న అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సేవా సమితి ప్రతినిధి గడ్డం శ్రీధర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బురుజు గల్లీలోని గౌడ సంఘం ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాలు ఏర్పాట్లపై చర్చించి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చిస్తామని తెలిపారు. దేవస్థాన సేవా సమితి పూర్తిస్థాయి కమిటీ పాల్గొని బోనాల వేడుకలు వైభంగా నిర్వహించేందుకు చొరవ తీసుకుంటుందన్నారు.

## ఆశాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి



ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పిస్తున్న ఆశావర్కర్లు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఆశావర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించాలని శుక్రవారం ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల వేతనం, నెలలో మొదటి వారంలోనే జీతాలు, అర్హత కలిగిన ఆశాలకు ఏఎన్‌ఎం పోస్టుల్లో వెయిటేజీ మార్కులు ఇస్తూ తగిన ప్రాధాన్యం, జాబు కార్డులో లేని పనులు చేయించకూడదని అలా చేయిస్తే అదనపు వేతనం ఇవ్వాలని వినతిపత్రంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు ఆర్.సంతోషా, ప్రధాన కార్యదర్శి కరుణ, రబియా, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ కె.రవిచారి జలమండలి మేనేజర్ జీవనజ్యోతిని కోరారు. శుక్రవారం చిక్కడపల్లిలోని బూడిద గల్లిలో పర్యటించి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. వెంటనే వాటర్ వర్క్స్ మెనేజర్‌తో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానికులు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## బ్రదర్ మోగన్ బెన్‌రాజ్ కన్నుమూత

నేడు నారాయణగూడలో అంత్యక్రియలు



(ఫైల్)

**చిక్కడపల్లి:** హెబ్రాన్ సొసైటీ గవర్నింగ్ బాడీ కోశాధికారి, సంఘ పెద్ద బ్రదర్ మోగన్ బెన్ రాజ్(78) శుక్రవారం కన్నుమూశారు. భక్తుల సందర్శనార్థం హెబ్రాన్ చర్చి ప్రాంగణంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు నారాయణగూడలోని క్రైస్తవ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల హెబ్రాన్ సొసైటీ చైర్మన్ బ్రదర్ జోసెఫ్ పి.కురియన్‌తో పాటు గవర్నింగ్ బాడీ ప్రతినిధులు ఆర్.పీటరాచారి తదితరులు సంతాపం తెలిపారు.